కళాభారతిని సద్వినియోగం చేసుకోవాలి: మేయర్

పునరుద్ధరించిన కళాభారతిని ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 3: జిల్లాలోని కళాకారులను ప్రోత్సహించేందుకు కళాభారతిని సిద్ధం చేశామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం ఉదయం మరమ్మతులు చేసిన కళాభారతిని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాభారతిని మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేసిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కళాభారతిని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు వాల రమణారావు, తోట రాములు, కుర్ర తిరుపతి, ఐలేందర్, ఈఈ రొడ్డ యాదగిరి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3 : సరికొత్త హంగులతో కొత్త రూపు సంతరించుకున్న కళాభారతి ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రైతే రాజు నాటక ప్రదర్శన అలరించాయి. ప్రదర్శనను కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కమిషనర్ స్వరూపారాణి, కళాకారులు రొడ్డ యాదగిరి, కృపాదానం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.22.25 కోట్ల రుణాల చెక్కుల పంపిణీ

పండ్లు నిలువ చేసే కోల్డ్ స్టోరేజీ సెంటర్‌ను ప్రారంభించిన నగరపాలక సంస్థ అధికారులు

కార్పొరేషన్, డిసెంబర్ 3: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కళాభారతిలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సంఘాలు, స్ట్రీట్ వెండర్ గ్రూపులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.22.25 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను కలెక్టర్ పమేలా సత్పతి పంపిణీ చేశారు. అంతకుముందు మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సమైక్య సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన పండ్లు నిలువ చేసే కోల్డ్ స్టోరేజీ సెంటర్‌ను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

సంబురాలు కాదు.. రైతుల ధాన్యం కొనుగోలు చేయండి

చిగురుమామిడి, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిందని సంబురాలు చేసుకోవడం కాదని, రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. మంగళవారం ఆయన సీతారాంపూర్‌లో మాట్లాడారు. గ్రామంలో మాజీ జడ్పీటీసీ ఏలేటి రాజిరెడ్డి 12 ఎకరాల్లో సాగుచేసిన సన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సన్నవడ్లను వెంటనే తూకం వేయాలని కోరారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు మహంకాళి కొమురయ్య తదితరులు ఉన్నారు.

సంకల్పం ఉంటే వైకల్యం సమస్య కాదు

- దివ్యాంగులను మానవీయ దృష్టితో చూడాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 3 : ఏదేని పని చేయాలనే సంకల్పం ఉంటే వైకల్యం సమస్య కానేకాదని, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పట్టుదలతో కృషి చేస్తే ఫలితానికి ఏ వైకల్యం అడ్డురాదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సదస్సులో పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగులను మానవీయ దృష్టితో చూడాలని, ఏపదవిలో ఉన్నా, ఏ హోదాలో ఉన్నా వారి పట్ల సానుభూతిని ప్రదర్శించాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఏవైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగ అధ్యాపకురాలు మహంకాళి సుగుణ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగులకు మద్దతుగా సంతకాల క్యాంపెయిన్ నిర్వహించారు. ఆడిటోరియంలో దివ్యాంగులు ప్రదర్శించిన నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు పురాతన ఉన్నత పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంధుల పాఠశాలలోని విద్యార్థులకు కలెక్టర్ బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న 35 మంది దివ్యాంగ కూలీలను డీఆర్‌డీవో శ్రీధర్ సన్మానించారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు అవగాహన సదస్సు

దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ మాట్లాడుతూ, అంగవైకల్య వ్యక్తులకు కూడా చట్టం హక్కులు కల్పించిందని, వాటిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని నర్మద, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో

మానకొండూర్/ వీణవంక/ శంకరపట్నం/ చిగురుమామిడి/ రామడుగు, డిసెంబర్ 3: మానకొండూర్, వీణవంక ఎంఆర్‌సీల్లో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శంకరపట్నం, చిగురుమామిడి, రామడుగు మండల కేంద్రాల్లోని భవిత సెంటర్లలో దివ్యాంగ బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే సత్యం

గంగాధర, డిసెంబర్ 3: చొప్పదండి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా విజయం సాధించానని, వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యేగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని మధురానగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు చేపట్టిన, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. విలేకరుల సమావేశం నిర్వహించిన సందర్భంగా తన భార్య రూపాదేవిని గుర్తు చేసుకుంటూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భావోద్వేగానికి లోనయ్యారు. అంతకు ముందు మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒగ్గరి ఐలయ్యకు నివాళి

గంగాధర, డిసెంబర్ 3: మధురానగర్‌లో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గంగాధర ఒగ్గు బీర్ల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర నాటక అకాడమీ అమృత పురస్కార గ్రహీత ఒగ్గరి ఐలయ్య స్మారకార్థం ఒగ్గుకథా నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యం ఐలయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం'

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మేడి అంజయ్య స్పష్టం చేశారు. నగరంలోని ప్రెస్‌భవనంలో మంగళవారం రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణను వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్, ఆంజనేయులు, రాజమల్లయ్య, మేడి రాజవీరు, దామెర సత్యం, రాజు పాల్గొన్నారు.

'వాల్టిపై 2కే 24' విజయవంతం చేయాలి

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 3: మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు పవర్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 4,5 వ తేదీల్లో వాల్టిపై 2కే 24 పేరుతో నేషనల్ టెక్నికల్ సింపోసీయం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈవెంట్స్, నాన్ టెక్నికల్ ఈవెంట్స్, కల్చరల్ యాక్టివిటీస్, డ్యాన్స్ ప్రోగ్రాంలతోపాటు ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వివిధ కళాశాల విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఏబూషి'కి ఘన నివాళి

ఏబూషి పాడే మోస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, డిసెంబర్ 3: మాజీ ఎంపీపీ, విద్యోదయ విద్యాసంస్థల అధినేత ఏబూషి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందగా, పలువురు ఘనంగా నివాళులర్పించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై, రామస్వామి మృతదేహంపై పూలమాల వేశారు. బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. అలాగే, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ ఆర్‌ఎం రాజు

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ మేనేజర్‌గా బి.రాజు బస్టాండ్‌లోని ఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్‌ఎంకు డిప్యూటీ ఆర్‌ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డీఎంలు మల్లయ్య, విజయమాధురి, లాజిస్టిక్స్ రీజియన్ మేనేజర్ రామారావు, ఏటీఎం సురేశ్, స్టేషన్ మేనేజర్ అంజయ్య పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆర్‌ఎం డిపోలు, బస్టాండ్‌ను పరిశీలించారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే ఈడీ ఖుస్రోషాఖాన్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలతో పాటు పీఆర్వో మల్హర్‌రావు ఉన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్,డిసెంబర్ 3: హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు అశోక్, విలాసాగర్, రాజయ్య పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: జిల్లాలోని కార్మికుల వైద్య సౌకర్యం కోసం జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ జిల్లా వర్క్‌షాపులో వారు మాట్లాడుతూ, ఈఎస్ఐ హాస్పిటల్ జిల్లా కేంద్రంలో లేకపోవడంతో కార్మికులు చికిత్స కోసం రామగుండానికి వెళ్లాల్సి వస్తున్నదన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవ తీసుకొని జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సత్యం, రవి, వెంకటేశ్, పరశురాములు, ఆరిఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై తొలగిన ప్రతిష్టంభన

గోపాల్‌రావుపేటలో స్వీట్లు తినిపించుకుంటూ సంబురాలు చేసుకుంటున్న గ్రామస్తులు

రామడుగు, డిసెంబర్ 3 : గోపాల్‌రావుపేటలో హనుమాన్ పురాతన ఆలయ పునర్నిర్మాణంపై కొన్ని నెలలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన హైకోర్టు తీర్పుతో తొలగినట్టు ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. హనుమాన్ ఆలయం నిర్మిస్తే గుడి నీడ తమ ఇంటిపై పడుతుందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్నతో పాటు ఆమె భర్త వెంకట్రాంరెడ్డి అడ్డుపడుతూ వచ్చారు. దీనిపై ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పలుమార్లు అధికారులు విచారణ చేపట్టి ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. అయినప్పటికీ సత్యప్రసన్న, వెంకట్రాంరెడ్డి కోర్టు ద్వారా నోటీసులు పంపి ఆలయ నిర్మాణాన్ని నిలిపివేశారు. ఈ దశలో మంగళవారం హైకోర్టు తీర్పు గ్రామ ప్రజలకు అనుకూలంగా రావడంతో ఆనందంతో సంబురాలు చేసుకున్నారు.

భూమి కోల్పోయిన దళితులకు భూమి అందించాలి

రామడుగు, డిసెంబర్ 3 వెలిచాలలో 2007-08 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ మాదిగ కులానికి చెందిన వారినుంచి ఇందిరమ్మ ఇండ్లకోసం భూమిని తీసుకున్నదని, నాడు భూమిని కోల్పోయిన దళితులకు తిరిగి భూమిని అందించాలని వెలిచాలకు చెందిన దళితులు మంగళవారం జిల్లా కేంద్రంలోని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందించారు. కాగా, తమ వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బదిలీపై వెళ్లిన హెడ్‌కానిస్టేబుళ్లకు సన్మానం

బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుళ్లను సత్కరిస్తున్న ఏఎస్సై మనోజ్‌కుమార్

రామడుగు, డిసెంబర్ 3 : రామడుగు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు ననవాల భూమయ్య, మునిగాల రత్నంగౌడ్, బొమ్మదేని రవీందర్ మంగళవారం ఏఎస్సై మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుళ్ల సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారని ఏఎస్సై పేర్కొన్నారు. రైటర్ పరశురాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

తిమ్మాపూర్, డిసెంబర్ 3: రామకృష్ణ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ సహిత గంగాభవానీ శంకర ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉరుమడ్ల కిరణ్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గురుమదానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరై భక్తులను, వ్రతం చేసుకునే జంటలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొన్న దంపతులకు బీజేపీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి దంపతులు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్ల గౌరవ వేతనం విడుదల చేయాలి

వీణవంక, డిసెంబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే చేసిన ఎన్యుమరేటర్ల గౌరవవేతనాన్ని విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ ప్రకటనలో కోరారు. అలాగే వారికి సెలవు దినములకు సంబంధిత అధికారులు సీసీఎల్ మంజూరుకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిభావంతుడైన విద్యార్థికి అభినందనలు

వీణవంక, డిసెంబర్ 3: జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో వీణవంక మండలం ఎలుబాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వాసుదేవరెడ్డి తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం అతడిని ఎంఈవో శోభారాణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి, పక్కన ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

జమ్మికుంట, డిసెంబర్3: శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, ప్రజల మన్ననలు పొందాలని సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన, ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్‌తో కలిసి జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ, స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. కేసులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ పట్టణ సీఐ రవి, ఎస్సై ఆరోగ్యం, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు వీడ్కోలు సన్మానం

రాంనగర్, డిసెంబర్ 3: కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్ ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఆర్ రాజయ్య మంగళవారం ఉద్యోగ విరమణ పొందగా, సీపీ అభిషేక్ మొహంతి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) మోడెం సురేశ్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పారమిత విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని పారమిత విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పలువురు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయినట్లు విద్యాసంస్థల నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారమిత ఉన్నత పాఠశాలలో 7 వతరగతి చదువుతున్న కె. ఋగ్వేద్, పారమిత హెరిటేజ్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి కె. లక్షిత్, 9వ తరగతి విద్యార్థి ఎం చేగువేర జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ పాఠశాల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో రామడుగు విద్యార్థిని ప్రతిభ

సైన్స్ ప్రదర్శనలో భాగంగా తాను తయారు చేసిన ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న విద్యార్థిని నునుగొండ రితిక

రామడుగు, డిసెంబర్ 3 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నునుగొండ రితిక ఇటీవల జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో గణిత శాస్త్ర విభాగంలో చక్కటి ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో రెండోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ సంగోజు శ్రీనివాస్‌ను అభినందించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు 11వ తేదీ ఆఖరు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024-25 సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 11వ తేదీ ఆఖరు అని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్ రావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రవేశం కోసం https://www.telanganaopenschool.org/. లో నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత, తప్పని సరిగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 83092 12661లో సంప్రదించాలని తెలిపారు.

శ్రీకాంతాచారి వర్ధంతి

సైదాపూర్/చిగురుమామిడి/ శంకరపట్నం, డిసెంబర్ 3: సైదాపూర్ మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు దుంపేటి ఆంజనేయులు, సైదాపూర్ శాఖ అధ్యక్షుడు పోలోజు రాజు, నాయకులు పూసాల ఆంజనేయులు, పూసాల రమేశ్, గోపగోని నవీన్, చిరంజెట్టి శ్రీనివాస్, భిక్షపతి, వస్తాదుల సదానందం, గడ్డం స్వామి పాల్గొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు శ్రీ రామోజ్ రాజకుమార్ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణాచారి, శ్రీనివాసాచారి, గ్రామాధ్యక్షుడు పోలోజు సదాచారి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వకర్మ- విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు తాటికొండ సదానందాచారి, సంఘం సభ్యులు నర్సింగోజు కృష్ణ, ఓదెల దేవరాజు, పంచకోటి రాజు, కస్తూరి రమేశ్, రవీంద్రాచారి, బాబన్న, రాజు, ఉద్యమకారుల ఫోరం అధికారి ప్రతినిధి రాసమల్ల శ్రీనివాస్, రజక సంఘం మండలాధ్యక్షుడు తాడిచర్ల తిరుపతి, చెరుకు సుధాకర్, అఫ్జల్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్య షష్ఠి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3 : భగత్‌నగర్‌లోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈనెల 7న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్య కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మైనార్టీ గురుకుల హాస్టల్ తనిఖీ

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 3: బొమ్మకల్ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంటశాలలో పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త జయపాల్‌రెడ్డికి సన్మానం

జయపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు

గంగాధర, డిసెంబర్ 3: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి విదేశీయాత్రను ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు మంగళవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఇక్కడ నాయకులు గుండ ప్రసాద్, పెంచాల మల్లేశం, మామిడిశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తల ధర్నా

చిగురుమామిడి, డిసెంబర్ 3: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆశ కార్యకర్తలు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేళ్ల శ్రీలత, మండలాధ్యక్షురాలు నాగేల్లి పద్మ, ప్రధాన కార్యదర్శి బోయిని ప్రియాంక, బండారి సరోజన, అంజలి, కమల, సునీత, శ్వేత, సరోజన, షాహిదా బేగం, సంధ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చొప్పదండి, డిసెంబర్ 3: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ విజయ భాస్కర్ సూచించారు. మంగళవారం చొప్పదండి మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన మత్తు పదార్థాలపై అవగాహన సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, ఉపాధ్యాయులతో పాటు ఎక్సైజ్ సిబ్బంది అనిల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ టీచర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

చిగురుమామిడి, డిసెంబర్ 3: చిగురుమామిడి తెలంగాణ టీచర్స్ యూనియన్ మండలాధ్యక్షుడిగా వర్మని రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కాంతాల ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేటెడ్ అధ్యక్షులుగా కేశెట్టి ఆంజనేయులు, గడ్డం రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ రామకృష్ణ, ఏ తిరుపతి, కార్యదర్శులుగా కే. ప్రేమలత, ఎం. అజితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గంప చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 3: తెలంగాణ టీచర్స్ యూనియన్ మండలాధ్యక్షుడిగా ముప్పిడి సహదేవ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్ల శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షురాలిగా టి. సురేఖ, ఉపాధ్యక్షులుగా కె. సబిత, జి. రాజు, కార్యదర్శిగా బి. శ్రీలత, పిట్టల పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముంజంపల్లి మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ఆదర్శన్ రెడ్డితో పాటు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ హాజరయ్యారు.



నాగరాజుకు స్వాగతం పలుకుతున్న దీక్షాపరులు

చెంజర్లలో శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న స్వాములు

గురుస్వాములకు ఘన స్వాగతం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3 : గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన కరీంనగర్ టూ శబరిమలై 24వ మహా పాదయాత్ర విజయవంతమై, తిరిగి జిల్లాకు చేరుకోగా, స్థానిక అయ్యప్ప స్వాములు, భక్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రలో ఆయనతో పాటు డీ సంపత్ గురుస్వామి, నరేశ్, సుమన్, శివయ్య, పూర్ణ, దిలీప్, రాము, ఫణీంద్ర, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 3: చెంజర్ల గ్రామానికి చెందిన వొడ్నాల శ్రీనివాస్ 19వ సారి మాల ధరించి, కరీంనగర్ నుంచి శబరిమలకు మహా పాదయాత్ర చేసి అయ్యప్ప స్వామిని దర్శించుకొని మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చెంజర్ల గ్రామ అయ్యప్ప భక్త బృందంతో పాటు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Mudrakolla Sridhar S/o. Late Mudrakolla Rajaiah (old name) H.No: 5-8-141, Gandhi Chowk, Sircilla Town,Rajanna Sircilla Dist. my and my Father surname was changed to MUDRAKOLA SRIDHAR S/o. Late. Mudrakola Rajaiah (New Name) NTK-0000

★Mudrakola Sridhar my wife Name was Mudrakolla Tanoja (old name) H.No: 5-8-141, Gandhi Chowk, Sircilla Town, Rajanna Sircilla Dist. my wife Name was changed to MUDRAKOLA TANUJA (New Name) NTK-0000

★Mudrakola Sridhar my Mother Name was Mudrakolla Durgamma (old name) H.No: 5-8-141, Gandhi Chowk, Sircilla Town, Rajanna Sircilla Dist. my mother Name was changed to MUDRAKOLA Durgamma (New Name) NTK-0000

★Sudhakar Goud Mushnam (Old Name) S/o. Bhoomaiah, H.No: 2-7-16, Sanjeevaiah Nagar, Sircilla, Rajanna Sircilla Dist. T.S have my name changed as Sudhakar Mushnam (New Name) NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189